క్లుప్తంగా

అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రారంభం



ధ్యాన కేంద్రం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సభ్యులు

పెదగంట్యాడ: పిరమిడ్ ధ్యాన కేంద్రాలు ఆధ్యాత్మిక జ్ఞానం, శాకాహారం, అహింస వంటి విలువలు ప్రజలకు నేర్పించే ప్రతిష్టాత్మక సంస్థ అని సీనియర్ పిరమిడ్ మాస్టర్ శివగణేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధి నెహ్రూ నగర్‌లో జంగమయ్య, వాణి దంపతులు నిర్మించిన భూలోకమ్మ పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని శని వారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస పెట్టడమని, మనిషికి ఓర్పు సహనం రావాలంటే విధిగా ధ్యానం చేయాలన్నారు. మనసును అదుపులో పెట్టుకునే ఏకైక శక్తి ధ్యానానికే ఉందన్నారు.అలాంటి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని నిర్మించి ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి రోజు ధ్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, విశాఖ సొసైటీ అధ్యక్షుడు పీవీ రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ రేవతిదేవి, సభ్యులు వనిత, బి అప్పారావు, బాలాజీ, జగదీశ్వరీ, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యాటక దినోత్సవం



ప్రసంగిస్తున్న కరస్పాండెంట్ రామారావు

గాజువాక: ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు శనివారం ఘనంగా నిర్వహించారు. పర్యాటక రంగంపై అవగాహన కల్పిస్తూ వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, అధ్యాపక ప్రతినిధులు వై.ఈశ్వరరాజు, వి.ఎ.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: మహిళా ఇంజినీరింగ్ విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికి తీయడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో టెక్నికల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నామని కాపుజగ్గరాజుపేట విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి అన్నారు. వచ్చేనెల 10 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్‌ను శనివారం విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, సర్క్యూట్రిక్స్, బిజినెస్ ఐడియాస్ విద్యార్థులు ప్రదర్శించనున్నారని తెలిపారు. కన్వీనర్ మనేంద్రసాయి,లక్ష్మణరావు పాల్గొన్నారు.



కుట్టిన టాప్‌తో విద్యార్థి

పాఠశాలల్లో వృత్తిపరమైన శిక్షణ విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు.. ప్రయోగాత్మక అనుభవాన్ని అందిస్తుంది. నిర్దిష్ట వృత్తి, ఉద్యోగాల కోసం వారిని సిద్ధం చేస్తుంది. ఇది పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను అందించడం ద్వారా ఉపాధిని మెరుగుపరుస్తుంది. నైపుణ్య అంతరాలను పరిష్కరించడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచుతుంది. ఈ ఉద్దేశంతోనే తలపెట్టిన వృత్తి విద్య (ఒకేషనల్) కోర్సులను గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రాక్టికల్‌గా నిజం చేస్తున్నారు. విద్యార్థులకు సెలవు రోజుల్లో కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీలో శిక్షణనిస్తూ వారిలో నైపుణ్యం పెంచుతున్నారు. చదువుతో పాటు విద్యార్థుల ఉపాధికి మార్గం చూపుతున్నారు. **- గాజువాక**



విద్యార్థులు కుట్టిన నమూనా డ్రెస్‌లు

ఉపాధికి నిచ్చెన

- గాజువాక హైస్కూల్ విద్యార్థులకు ఎంబ్రాయిడరీ, కుట్టు శిక్షణ తరగతులు
- ఇప్పటికే ఒక బ్యాచ్ పూర్తి • కొనసాగుతున్న రెండో బ్యాచ్ శిక్షణ



మిషన్ కుట్టడం నేర్చుకుంటున్న విద్యార్థులు



కుట్టు శిక్షణలో విద్యార్థినులు

పది రోజుల ఇంటర్న్‌షిప్

వృత్తి విద్యా కోర్సుల ఇంటెర్న్‌షిప్ కార్యక్రమం గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నాలుగు రోజుల కిందట ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని పది రోజుల పాటు నిర్వహించనున్నారు. హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులతోపాటు హైస్కూల్ ప్లస్‌లో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థినులకు కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీలో శిక్షణ ఇస్తున్నారు. 14 మంది విద్యార్థులు ఒక బ్యాచ్‌గా ఈ శిక్షణ కొనసాగుతోంది. గత వేసవి సెలవుల్లో ఒక బ్యాచ్ శిక్షణ పూర్తయింది. ప్రస్తుతం రెండో బ్యాచ్‌కు శిక్షణ కొనసాగుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎస్ఎస్‌జే సిల్క్స్ సహకారంతో..

గాజువాక హైస్కూల్ విద్యార్థులకు కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీల్లో శిక్షణ ఇవ్వడం కోసం నగరానికి చెందిన ఎస్ఎస్‌జే సిల్క్స్ సంస్థ ముందుకొచ్చింది. సంస్థ కో ఆర్డినేటర్ మెట్ట సుధాకర్ భట్లు, జిల్లా కో ఆర్డినేటర్ రిషి, జీసీడీవో గుమ్మడి శ్రీదేవి ఈ శిక్షణను పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులు వివిధ రకాల డ్రెస్‌లు, బ్లౌజ్ కటింగ్‌లు, మగ్గం వర్కులను నేర్చుకొంటున్నారు. ట్రైనర్ కందుల భారతి దగ్గరుండి విద్యార్థులకు మెళకువలు నేర్పిస్తున్నారు.

భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు



ఒకేషనల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కుట్టు మిషన్, ఎంబ్రాయిడరీలో శిక్షణ చురుగ్గా సాగుతోంది. విద్యార్థులు కూడా చాలా శ్రద్ధగా నేర్చుకొంటున్నారు. ఇది వారిలో నైపుణ్యం మెరుగుపడి భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదపడుతుంది. వారి చదువుకు ఇబ్బంది లేకుండా సెలవు రోజుల్లో ఇలాంటి కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– కందుల భారతి, ఒకేషనల్ టీచర్

డ్రెస్‌లు కుట్టడం నేర్చుకుంటున్నా..



సెలవుల్లో మాకు కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నారు. నేను డ్రెస్‌ల కటింగ్, కుట్టడం నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం కుట్టడం వచ్చింది. త్వరలోనే మొత్తం పని నేర్చుకుంటాను. అదనపు స్కిల్స్ నేర్పించడం ఆనందంగా ఉంది.

– ప్రియ, విద్యార్థి

ఎంబ్రాయిడరీ కూడా ..



మా స్కూల్‌లో ఒకేషనల్ కార్యక్రమంలో భాగంగా కుట్టు మిషన్ నేర్చుకుంటున్నాను. దీంతో పాటు ఎంబ్రాయిడరీ కూడా నేర్పుతున్నారు. శిక్షణ చాలా సరదాగా సాగుతోంది. ఇవి నేర్చుకుంటుంటే నాలో ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతోంది.

– వెంకట లక్ష్మి, విద్యార్థి

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్
- వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పరిశీలన

కూర్మన్నపాలెం: ప్రజలకు తాగునీరు సరఫరా సక్రమంగా చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థనగర్‌లో ఉన్న 12ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పరికరాలను పరిశీలించి వాటి పనితీరును గమనించారు. ముఖ్యంగా నీటి శుద్ధి పరికరాలు.. వాటి ఉపయోగం తదితర అంశాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంపు హౌస్ పనితీరు.. ప్రజలకు మంచినీరు సకాలంలో అందుతుందా అని నీటి సరఫరా విభాగం ఇంజినీర్‌ను కమిషనర్ ప్రశ్నించారు. ప్రజలకు తాగునీరు అందించే విషయంలో సమస్యలు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ బొండా జగన్ వార్డులోని



ప్లాంట్‌లో నీటిని తనిఖీ చేస్తున్న కమిషనర్

సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పర్యటనలో ఇంజినీరింగ్ విభాగం అధికారులు రాయల్ బాబు, శ్రీనివాసరావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి స్పందన

అగనంపూడి: అగనంపూడి సీడబ్ల్యూసీ, శ్రీరామ ఫైనాన్స్ సంస్థ సంయుక్తంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించిన ఉచిత దంత వైద్యశిబిరానికి స్పందన లభించింది. శ్రీరామ ఫైనాన్స్ గోల్డెన్ జూబ్లీ సందర్భంగా సామాజికసేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంస్థ మేనేజర్ రాంబాబు చెప్పారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు యల్లపు సాంబశివరావు, బలిరెడ్డి సత్యనారాయణ, కొలిపాక అప్పారావు, దంత వైద్య నిపుణురాలు సాయి సుధ పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ సంబరాలు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ఫేజ్–6లో ఆదివారం బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్టు లైన్స్‌క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మరళీధరరెడ్డి తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ఈ వేడుక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సంబరాలకు పరిసర ప్రాంతాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

లలితా త్రిపురసుందరిగా దుర్గమ్మ



వుడాకాలనీలో సహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్నారు. జీవీఎంసీ 76వ వార్డు బర్మా కాలనీలో దుర్గాదేవిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బాలాచెరువు ఉమారామాలింగేశ్వర స్వామి ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో ఆలయ అర్చకుడు వాసుదేవశర్మ అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

➽ జీవీఎంసీ 77వ వార్డు పరిధి నమ్మిదొడ్డి కూడలిలో కనకదుర్గ ఆటోస్టాండ్ సభ్యులు ఏర్పాటు చేసిన మండపం వద్ద అమ్మవారిని వార్డు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బట్టు పైడిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి పైడిరాజు, రాలింగి అప్పలరాజు, సోమునాయుడు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: వుడాకాలనీ బృందావన్ పార్కులో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో 108 మంది మహిళలు సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో స్వామీజీ రఘువీరానంద పాల్గొన్నారు.



లలితా త్రిపుర సుందరిగా బాలచెరువు దుర్గమ్మ



లలితా త్రిపుర సుందరిగా మహాదుర్గ



ధనలక్ష్మిగా మహాలక్ష్మి

భక్తిశ్రద్ధలతో దీపారాధన

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో ప్రతినిధులు ఏర్పాట్లు చేవారు.

➽ దిబ్బపాలెంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైభవంగా అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు శంఖు, చక్రం ఆకారాల్లో దీపారాధన చేశారు. కార్యక్రమంలో యలమంచిలి అప్పారావు, ఈగల నరసింగరావు, గురు భవానీ ఇల్లపు జువ్వాలు పాల్గొన్నారు.



దిబ్బపాలెంలో దీపారాధన చేస్తున్న భక్తులు, భవానీలు

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో ఆరో రోజు శనివారం మహాదుర్గ అమ్మవారు ఎరుపు వర్ణం చీరలో లలితా త్రిపుర సుందరిగా..మహాలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మిగా, మహాసరస్వతి పసుపు వర్ణం చీరలో వాఘేశ్వరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిశర్మ నేతృత్వంలో ఉదయం మహాదుర్గ అమ్మవారికి సహస్ర కలువ పుష్పార్చన చేశారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



గాజువాక: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సీరపు నాగరాజు, **స్టూడెంట్ వింగ్** అధ్యక్షుడిగా రెడ్డిపల్లి అవినాష్, **ఆర్‌టీఐ వింగ్** అధ్యక్షుడిగా నమ్మి శ్రీనివాస **ప్రసాద్, గ్రీవెన్స్** సెల్ అధ్యక్షుడిగా గొండిశెట్టి వెం**కట రమణారెడ్డి,** వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా బెల్ల పెంటబాబు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా పిట్ట రెడ్డి, కల్చర్ వింగ్ అధ్యక్షుడిగా సారిపల్లి సత్యవతి, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా వాకపల్లి శేఖర్, డాక్టర్ వింగ్ అధ్యక్షుడిగా సతీష్‌కుమార్ బోని, ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడిగా తలారి నాగేశ్వర రావు, కళాకారుల విభాగం అధ్యక్షుడిగా దేవరపు చిరంజీవిని నియమించారు. ఈ మేరకు శనివారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యం కాకుండా కాపాడాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యం కాకుండా కాపాడాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఈవోఐ, నక్కపల్లి మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా శనివారం అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద స్టీల్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్యాకేజీ ప్రకటించాం అని ప్రజలను మభ్య పెట్టి మరోవైపు ఆపరేషన్‌లో కాంట్రాక్ట్ జోక్యానికి అవకాశం కల్పిస్తూ 46 ఈవోఐలు జారీ చేశారన్నారు. తద్వారా విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదం మరుగున పడి విశాఖ ఉక్కు కాంట్రాక్టర్ల హక్కుగా మారిపోతుందన్నారు. ప్లాంట్ ప్రైవేటీరణ జరగదని పార్లమెంట్‌లో కేంద్ర ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ మాట్లాడుతూ సమర్థవంతమైన యాజమాన్యాన్ని నియమించే విధంగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలన్నారు. స్టీల్ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ యాజమాన్యం తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఉద్యోగులపై నెపం మోపుతుందన్నారు. మిట్టల్ ప్లాంట్ ఏర్పాటు, ఈవోఐలకు వ్యతిరేకంగా ఈనెల 29న ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించనున్న ధర్నాలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొవాలని కోరారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వై.టి. దాస్, యు. రామస్వామి, కె.ఎస్.ఎన్. రావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

డాక్టర్ కృష్ణంరాజు సేవలు ఎనలేనివి

అగనంపూడి: నిరుపేద, అభాగ్యులైన రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించి అందరి ఆదరాభిమానాలు చూరగొన్న డాక్టర్ కృష్ణంరాజు సేవలు మరువలేనివని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపీకృష్ణ, జగన్నాథ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు అన్నారు. విశేష సేవలు అందించిన డాక్టర్ కృష్ణంరాజు తన స్వగ్రామం భీమవరం వెళ్లిపోతున్న సందర్భంగా మహాత్మాగాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కోసూరి తాతారావు, జానకీదేవి, శోభారాణి, తలారి లలిత కుమారి పాల్గొన్నారు.



డాక్టర్ కృష్ణంరాజును సత్కరిస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

ఫైవ్ ఎస్ పోటీల్లో ఇంజినీరింగ్ షాప్స్ సత్తా

ఉక్కునగరం: పని ప్రదేశ నిర్వహణ (ఫైవ్ ఎస్) పోటీల్లో స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగం జట్టు ఉద్యోగులు గోల్డ్ అవార్డు గెలుపొందారు. క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఉక్కు ఎంపీ హాలులో చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్స్ (సీసీక్యూసి) పోటీల్లో 34 సంస్థలకు చెందిన 149 జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఫైవ్ ఎస్ కేటగిరీలో ఇంజినీరింగ్ షాప్స్‌కు చెందిన ఉద్యోగులు సీహెచ్. శ్రీనివాస శాస్త్రి, కొణతాల చంద్రమోహన్, ఎస్. సతీష్ కుమార్, డి. నిరంజన్ రెడ్డి, రామచంద్రరావు గోల్డ్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఇంజినీరింగ్ షాప్స్ విభాగాధిపతి ఎస్.కె. పాండే, అధికారులు ముఖోపాధ్యాయ, కె. శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.



గోల్డ్ అవార్డు అందుకుంటున్న ఇంజినీరింగ్ షాప్స్ ఉద్యోగుల బృందం